క్లుప్తంగా

సొసైటీలో ఎరువుల తనిఖీ



దొమ్మేరు సొసైటీలో ఎరువులు పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

తాళ్లపూడి(కొవ్వూరు): మండలంలోని దొమ్మేరు సొసైటీలో గురువారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి యూరియా నిల్వ తదితర అంశాలపై తనిఖీ చేశారు. యూరియాపై ఉన్నటువంటి అపోహలను తొలగించేందుకు రైతులతో నేరుగా మాట్లాడారు. వివిధ పంటలలో యూరియా వాడకం, దిగుబడుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అధిక మోతాదులో యూరియా వాడడం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస్, ఏఓ గంగాధర్, తహసీల్దార్ దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, పీహెచ్‌సీ సిబ్బంది

నిడదవోలు రూరల్: మహిళల ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శివాజీ అన్నారు. స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సమిశ్రగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యవంతులైన మహిళలు కుటుంబంతోపాటు సమాజాన్ని తీర్చి దిద్దుతారన్నారు. వ్యక్తిగత ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ బిందు శ్రీదేవి, ఆర్థోపెడిక్ డాక్టర్ రోహిత్‌లు 225 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనిధి, స్థానిక నాయకులు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకుముడత నివారణకు సస్యరక్షణ చేపట్టండి



ఆకుముడత నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

దేవరపల్లి: వరి చేలల్లో ఆకుముడుత తెగులు ఉన్నందున నివారణ కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్ రాజ్ రైతులకు సూచించారు. మండలంలోని దుద్దుకూరులో గురువారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కమల్‌రాజ్ మాట్లాడుతూ వరి చేలల్లో ఆకుముడత, పొండ తెగులును గుర్తించినట్టు ఆయన తెలిపారు.

పొడతెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా ప్రొపికొనజోల్ 1 మిల్లీ లీటరును లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని ఆయన సూచించారు. ఒక జత ఎలుకలు ఏడాదిలో 2067 ఎలుకలను పుట్టిస్తాయని, వాటి నివారణకు బ్రోమోడైన్‌లోన్ మందు 10 శాతం, 80 శాతం నూకలు, 10 శాతం నూనె కలిపి ఎరను పొట్లాల్లో చుట్టి తెరిచి ఉన్న కన్నాలలో వేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ

నిడదవోలు: రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని బీజేపీ సీనియర్ నాయకుడు రంగా వెంకటేశ్వరరావు అన్నారు. ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను పురష్కరించుకుని గురువారం రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో 50 మంది మహిళలకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గంగుల వెంకటలక్ష్మీ, నాయకులు, పాల్గొన్నారు.

ఇదేమి పారిచోద్యం

- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది
- నిర్లక్ష్యంగా ఉన్న సంపద కేంద్రాలు



అన్నవరప్పాడులో రోడ్డుపైనే చెత్తాచెదారం

పెరవలి: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో గ్రామాలు కంపుకొడుతున్నాయి. అసలే వర్షాలు దీనికి తోడు ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లి గృహవాసులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై మురుగునీరు పారుతున్నా, చెత్త కుప్పలు పేరుకుపోయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవట్లేదని ప్రజలు మండిపడుతున్నారు. రోడ్లపై మురుగునీరు గురించి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు ఏకరవు పెట్టినా అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. దీంతో గ్రామాలు కంపుతో గతి తప్పుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం వేల కోట్లు ఖర్చు చేసి గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చి దిద్దడానికి అన్ని అమర్చినా అధికారుల నిర్లక్ష్యంతో బూడదలో పోసిన పన్నీరులా పరిస్థితి మారిపోయింది. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని నమ్మిన ఆనాటి ప్రభుత్వం అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన చేసింది. కానీ, అధికారులు కార్యచరణ సక్రంగా లేకపోవటంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది పరిస్థితి. పారిశుధ్య నిర్వహణ కోసం కార్మికులతో పాటు అందుకు అవసరమైన చెత్తా చెదారాలను పోగు చేయటానికి, వాటి నుంచి సంపద సృష్టించటానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు ఒక్కొక్కటిగా గత ప్రభుత్వం సమకూర్చింది.

డ్రైనేజీ సౌకర్యం లేక..

రోడ్లపై మురుగునీరు యథేచ్ఛగా వదిలేస్తున్నా పంచాయతీ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా, పీజీఆర్ఎస్‌లో వేడుకున్నా ఫలితం మాత్రం శూన్యం. దీంతో రోడ్లపై మురుగునీరు కాలువలా ప్రవహిస్తుంది. ఇందుకు వేదికగా వడలి- ముక్కామల ఆర్అండ్‌బీ రహదారి అని చెప్పవచ్చు. ఇక పలు కాలనీల్లో డ్రైనేజీ సౌకర్యం లేక రోడ్లపైనే మురుగునీరు వదిలివేయటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కానూరు, అన్నవరప్పాడు, కాపవరం, ఖండవల్లి, ముక్కామల, పెరవలి గ్రామాల్లో పలు కాలనీలో డ్రైనేజీలు లేక మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండి కాలనీలు దుర్గంధభరితంగా మారాయి.



అన్నవరప్పాడులో ఆర్అండ్‌బీ రోడ్డుపై మురుగునీరు

షెడ్లకు రూ.1.17 కోట్లు

పెరవలి మండలంలో 18 గ్రామాల్లో 18 సంపద కేంద్రాలకు షెడ్లు నిర్మించారు. వీటికి గ్రామ స్థాయిని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షలతో నిర్మించగా.. 18 షెడ్లకు రూ.1.17 కోట్లు ఖర్చు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతీ గ్రామానికి పారిశుధ్య నిర్వహణ కోసం ట్రైసైకిళ్లు ఒక్కొక్కటి రూ.31,400 చొప్పన 69 ట్రైసైకిళ్లు పంపిణీ చేయగా.. వీటి విలువ రూ.22.66 లక్షలు, 24 ఆటోలకి రూ.24 లక్షలు, డస్ట్ బిన్‌లు 588 పంపిణీ చేయగా వీటి విలువ రూ.3.58 లక్షలు గత ప్రభుత్వాలు ఇప్పటివరకు రూ.1.68 కోట్లు ఖర్చు చేశాయి. ఇంత చేసినా ఇప్పటివరకు కొన్ని గ్రామాల్లో వీటిని వినియోగంలోకి తీసుకురాలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.



ఖండవల్లిలో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం

ఆదాయం ఎంతంటే?

స్థానిక ప్రజాప్రతినిధుల కోసమో లేక ఉన్నతాధికారుల మెప్పు కోసమో తెలియదు కానీ, పెరవలి మండలంలో 18 గ్రామాల నుంచి ఈ సంపద కేంద్రాల ద్వారా ఇప్పటివరకు కేవలం రూ.24 వేల రూపాయిల ఆదాయం మాత్రం సంపాదించారు. ప్రభుత్వ లక్ష్యం ఎలా ఉన్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ లక్ష్యం నీరు గారిపోవటంతో ప్రజలు, ఉన్నతాధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

పంచాయతీలకు పెరిగిన సిబ్బంది

గత ప్రభుత్వాల కన్నా వైఎస్సార్ సీపీ హయాంలో గ్రామాల్లో శాఖకు ఒక అధికారిని నియమించటంతో ఉద్యోగుల సంఖ్య గ్రామ స్థాయిలో బాగా పెరిగింది. దీంతోపాటు పంచాయతీలకు వివిధ శాఖల పనుల ప్రమేయం తగ్గింది. పారిశుధ్యం మీద దృష్టి పెట్టాల్సిన పంచాయతీ కార్యదర్శులు వీటిని నిర్లక్ష్యం చేయటంతో ఇవి ఆర్థిక పరిపుష్టి సాధించలేక పోతున్నాయి.

చెత్తాచెదారం పేరుకుపోతుంది



అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడు మాత్రమే గ్రామాలను శుభ్రం చేస్తున్నారు. ఇంటి దగ్గర చెత్తను సేకరించట్లేదు. ఒక వేళ సేకరించినా రోడ్లు, కాలువ గట్ల ప్రక్కన వేస్తున్నారు. దీని వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంపద కేంద్రాలు ఉన్నా చెత్త మాత్రం వేయటం లేదు.

– రొట్టే నవీన్, తీపర్రు.

అధికారులు పట్టించుకోవడం లేదు



వడలి- ముక్కామల ఆర్అండ్‌బీ రోడ్డుపై మురుగునీరు పారుతుంది. ఈ మురుగునీరు గురించి రెండు మండల సమావేశాల నుంచి ఈఓపీఆర్‌డీని అడుగుతుంటే సమస్య పరిష్కరిస్తాం అంటున్నారు. కానీ, ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. ఈయన ప్రభుత్వ అధికారేనా అని అనుమానం వస్తుంది. ఏ గ్రామం వెళ్లినా మొదట దర్శనం ఇచ్చేవి రోడ్ల పక్క చెత్త కుప్పలు, రోడ్లపై మురుగునీరే కనిపిస్తున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. చెత్తా చెదారం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– పల్లేటి రవి, ఎంపీటీసీ సభ్యుడు, ఖండవల్లి.

వర్షాలతో ఇబ్బంది అవుతుంది



సంపద కేంద్రాల వద్ద ఎరువులు తయారు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వర్షాల వల్ల ఎరువు తయారు చేయడానికి షెడ్ల దగ్గరకు చెత్తను తీసుకెళ్లడానికి ఇబ్బందులు ఉన్నాయి. వర్షాలు తగ్గిన తరువాత అన్ని గ్రామాల్లో చెత్తను సేకరించి ఎరువు తయారీపై దష్టి సారిస్తాం.

– వెంకటరమణ, ఈఓపీఆర్‌డీ అండ్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, పెరవలి.

జగన్‌ను కలిసిన మాజీ హోం మంత్రి వనిత



జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన తానేటి వనిత, నియోజకవర్గ ముఖ్య నాయకులు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మాజీ హోంమంత్రి, పార్టీ రాష్ట్ర క్రమ శిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యక్రమాలు, రాజకీయ పరిస్థితులు తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారని ఆమె తెలిపారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆదేశించినట్లు వనిత పేర్కొన్నారు.

వెంకట్రావుకు జగన్ అభినందన



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో తలారి వెంకట్రావు

తాళ్లపూడి: చంద్రబాబు ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకు **బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ** కార్యక్రమం ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావును వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. ఆయన గురువారం తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్ సూచించినట్లు తలారి తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపణీ



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న కాంతకుమారి

నల్లజర్ల: దూబచర్ల జడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదివిన 1984–85 బ్యాచ్‌కు చెందిన ముత్యం కాంతకుమారి పాఠశాల విద్యార్థులకు గురువారం రూ.15వేలతో క్రీడాదుస్తులు అందజేశారు. ఆమె ప్రస్తుతం గుండుగొలను జడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో పాఠశాలకు ఇన్వెర్టర్, కంప్యూటర్ ప్రింటర్‌ను బహూకరించారని, పాఠశాల అవసరాలకు ఇతోధిక సాయం అందజేస్తున్న కాంతకుమారిని హెచ్‌ఎం సుమతి, వ్యాయామ ఉపాధ్యాయని అరుణ, ఉపాధ్యాయుడు బొందల శ్రీనివాస్ అభినందించారు.

వైద్య విద్యను దూరం చేసిన కూటమి



చాగల్లులో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న తలారి వెంకట్రావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ తలారి వెంకట్రావు
- చాగల్లులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ గ్రామ సభ

చాగల్లు: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించి పేదలకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం గురువారం చాగల్లులోని ఇందిరమ్మ కాలనీలో నిర్వహించారు. చంద్రబాబు 15 నెలల పాలనలో అరాచకాలు, మోసాలను వివరించారు. తొలుత కాలనీలో మాజీ సర్పంచ్ గంద్రోతు కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకట్రావు మాట్లాడుతూ, పేద విద్యార్థులకు మేలు చేసేందుకే జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారన్నారు. వాటిని ప్రైవేటీకరించాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు తల్లికి వందనం పేరుతో ప్రజలను వంచన చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లులు ఉంటే 54 లక్షల మందికి మాత్రమే ఈ పథకం ఇచ్చారన్నారు. రాష్ట్రంలో వైద్య, వ్యవసాయ రంగాలను నిర్వీర్యం చేసిందని, ఆరోగ్యశ్రీని అటకెక్కించిందని. రైతన్నలకు పెట్టుబడి సాయం అందించకుండా అప్పుల పాలు చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం దాదాపు ఏడు లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఎగ్గొట్టిందని ఆరోపించారు. ఇంటి వద్దకే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో 9,280 మంది ఆపరేటర్లు వీధుల పాలయ్యారని ఆయన మండిపడ్డారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి పరిమిసోమరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, కొవ్వూరు పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, ఎంపీటీసీ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె పాషా, మాజీ ఎంపీటీసీ చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, గేడా శ్యామ్, నందిగంపాడు సర్పంచ్ కుడప రాంబాబు, షరీఫ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చలో మెడికల్ కాలేజి' పోస్టర్ ఆవిష్కరణ



విలేకర్లతో మాట్లాడుతున్న సత్తి సాయి ఈశ్వరరెడ్డి

దేవరపల్లి: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు, మాజీ హోం మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో శుక్రవారం చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సత్తి సాయి ఈశ్వర రెడ్డి తెలిపారు. ఈ మేరకు పార్టీ విద్యార్థి, యువజన, సోషల్ మీడియా విభాగాల ద్వారా కూటమి ప్రభుత్వ కుట్రను ప్రజలకు వివరిస్తామన్నారు. మండలంలోని యర్నగూడెం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేసి. ఆరు కళాశాలల నిర్మాణాలను పూర్తి చేసి బోధన సైతం ప్రారంభించారన్నారు. ప్రభుత్వ అధీనంలో ఉన్న మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరం కావడంతో పాటు, పేద ప్రజలకు వైద్యం అందక ప్రైవేటు సంస్థల కబంధ హస్తాల్లో నలిగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు.

రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటలకు దేవరపల్లి డైమండ్ జంక్షన్ నుంచి నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి భారీ ర్యాలీగా తరలి వెళ్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ నక్కా పండు, దేవరపల్లి మండల అధ్యక్షుడు అనిశెట్టి సూర్యచంద్రరావు, నియోజక వర్గ రైతు విభాగం అధ్యక్షుడు సత్తి జగదీశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యువజన విభాగం నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం విజయవంతం చేయాలని నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రాచకొండ సురేష్ తెలిపారు. కొవ్వూరు పట్టణంలో గురువారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 19న నిర్వహించే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని యువత రాజమండ్రి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువన విభాగం నాయకులు భూపతి రాజు, పుల్లూరి రాజు, మజ్జి వంశీ పాల్గొన్నారు.

వీఆర్ఏల ధర్నా



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

నిడదవోలు (ఉండ్రాజవరం): తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే తీర్చాలని డిమాండ్ చేస్తూ ఉండ్రాజవరం తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం వీఆర్ఏలు ధర్నా చేపట్టారు. కారుణ్య నియామకం చేపట్టాలని, పేస్కేలు అమలు, నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం, ఈనెల 22న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని వీఆర్ఏలు పేర్కొన్నారు.

వీఆర్ఏల నిరసన

పెరవలి: వీఆర్ఏలు ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్నా ప్రభుత్వం తమ పట్ల చిన్న చూపు చూస్తుందని, వెంటనే తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని వీఆర్ఏలు నిరసన చేశారు. రాష్ట్ర వీఆర్ఏల సంఘం పిలుపు మేరకు పెరవలి తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, జీతాలు పెంచి, ప్రమోషన్లు కల్పించాలని, పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 12 ఏళ్లుగా ఇదే వృత్తిలో ఉన్నామని, అర్హతలు ఉన్నా ప్రమోషన్ ఇవ్వట్లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మండల వీఆర్ఏలు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

నిడదవోలు (ఉండ్రాజవరం): మండలంలో వేలివెన్ను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్-2లో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యాక్రమంలో భాగంగా మహిళలు, కిషోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండెజబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మహిళలను పరీక్షించడం రక్త హీనత, సికిల్ సెల్స్, పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన, ఎస్‌జే ఇర్ఫాన్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎంజేజేబీవై చెక్కు పంపిణీ

నిడదవోలు రూరల్: ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) బీమాతో మృతి చెందిన కుటుంబానికి భరోసా ఉంటుందని సమిశ్రగూడెం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ జి.కొండబాబు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెనికి చెందిన సిర్రా నల్లమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుమారుడు కోట వెంకటకుమార్‌కు రూ.2లక్షల పీఎంజేజేబీవై చెక్కును మేనేజర్ గురువారం అందజేశారు.

పోషకాహార లోపంపై ప్రత్యేక దృష్టి

నల్లజర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రత్యేక పోషకాహారం అందిస్తున్నా, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా, రక్తహీనత, పలు రకాల సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు అంగన్‌వాడీ కేంద్రాల వేదికగా రాష్ట్రీయ పోషన్ మాసోత్సవం-2025 నిర్వహిస్తున్నట్టు సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి తెలిపారు. పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ప్రారంభించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, బాలికలకు రక్తహీనత, పోషకాహార లోపాలను నివారించేందుకు, వారి పెరుగుదల పర్యవేక్షణ, మహిళల ఆరోగ్యం, బాలలకు పోషణతో పాటు చదువు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

ఇరవై ఏళ్ల నిరీక్షణ ఫలిస్తున్న వేళ

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన ముత్యాల బాలాజీ చిత్ర పరిశ్రమలో అవకాశాల కోసం గత ఇరవై ఏళ్లుగా హైదరాబాదులో కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం లేకపోయింది. తన ప్రతిభపై నమ్మకంతో ఓపికగా ప్రయత్నాలు ప్రారంభించి మొట్టమొదటి సారిగా చిత్ర దర్శకుడిగా రూపొందించిన చిత్రం మిష్టర్ సోల్జర్ ఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా గురువారం నల్లజర్లలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ, తాను గతంలో అగ్ర దర్శకులు శ్రీనివాసరెడ్డి, లారెన్స్, మధుసూదన్‌ల వద్ద అసోసియేట్‌గా పనిచేసినట్టు వివరించారు. డాన్, చందమామ, టాటాబిర్లా మధ్యలో లైలా, కాశీ, నీకు నేను- నాకు నువ్వు చిత్రాలకు, చక్రవాకం వంటి డైలీ సీరియల్స్‌కు సహాయ దర్శకుడిగా పనిచేసినట్టు వివరించారు.



మిష్టర్ సోల్జర్ చిత్రీకరణలో హీరోయిన్ శ్రీలుకు సూచనలిస్తున్న దర్శకుడు ముత్యాల బాలాజీ